# పదపదవే వయ్యారి గాలిపటమా…

"నాన్నా" ఆరేళ్ళ బుజ్జికొండ మెల్లగా అడుగులేసుకుంటూ వచ్చి పిలిచాడు.

"ఏం నాన్నా?" చదువుతూన్న పేపర్లోంచి తలెత్తకుండానే కొడుకుని ముద్దుగా అడిగాడు సీతారాం.

"మరేమో సంక్రాంతి వస్తుంది కదా ఉహూ హు" అన్నాడు బుంగ మూతిపెట్టి నేలకేసి కాళ్ళుకొడ్తూ.

"అలాగే అలాగే అమ్మతోచెప్పి పండుక్కి బోల్డన్ని అప్పచ్చులు వండిస్తాగా" అన్నాడు సీతారాం పేపర్లోంచి ఇంకా తలెత్తకుండానే.

అతని మాటలు వింటూనే పక్కగదిలోంచి అతని భార్య దుర్గాదేవి రయ్యిన వచ్చింది.

"మరేం మరేం వంటలక్కలా నేను తేరగా దొరికాను అవీ ఇవీ వండిపెట్టడానికి నేనేం వండను మీరే వండుకోండి బోల్డన్ని అప్పచ్చులు!" అంది దుర్గాదేవి రుసరుసలాడ్తూ.

"వా" అంటూ రాగం ఎత్తుకుని హఠాత్తుగా నేలమీద బుజ్జిని, ఈ మూలనుండి ఆ మూలకి, ఆ మూలనుండి ఈ మూలకి దొర్లసాగాడు బుజ్జికొండ.

సీతారాం కంగారుపడిపోయాడు.

బుజ్జికొండని కిందనుండి లేవనెత్తి "తప్పమ్మా అలా నేలమీద దొర్లకూడదు. అలాచేస్తే బట్టలు మాసిపోతాయ్ కదా..నీ బట్టలు మాసిపోతే మరి నేనే కదా ఉతకాలి! నీకు బోల్డన్ని అప్పచ్చులు నేనే వండిపెడ్తాగా! బుజ్జగిస్తూ అన్నాడు.

"నాకేం అప్పచ్చులు వద్దు నా.."

"మరేం కావాలి! కొత్త బట్టలా?"

"కాదు....వా...."

"మరేం కావాలో చెప్పు...." పళ్ళు బిగబట్టి విసుగ్గా అరిచాడు సీతారాం.

బుజ్జికొండ చటుక్కున ఏడుపాపి తండ్రివంక కోపంగా చూశాడు.

"అలా కోపంగా అరుస్తారేం? యేం .... మళ్ళీ నేలమీద పడి దొర్లాలా?"

సీతారాం నాలుక్కొరుక్కుని నవ్వు తెప్పించుకుని నవ్వాడు.

"ఛీ.... యేంటి బాబూ మరీ అంత దుడుకుగా ఉంటావ్....అలా దొర్లకూడదమ్మా....మరి బట్టలుతకాలంటే నాకు కష్టం అవుతుంది కదా? హి....నీకేం కావాలమ్మా? హిహి" అడిగాడు సీతారాం కొడుకు ముందు మోకాళ్ళమీద నిల్చుని.

"నాకు గాలిపటం కావాలి!" అన్నాడు బుజ్జికొండ తీవ్రంగా మొహం పెడ్తూ.

"తప్పమ్మా....గాలిపటాలు మనలాంటివాళ్ళు ఎగరెయ్యకూడదు.... వొఠిజులాయ్ వెధవలు ఎగరేస్తారు గాలిపటాలు తెల్సా?" అన్నాడు సీతారాం బుజ్జికొండ తల నిమురుతూ.

ఆ మాటలు వింటూనే దుర్గాదేవి కయ్యమని మొగుడి మీద లేచింది.

"ఎవరండీ జులాయ్ వెధవలు? మీరు మీ తమ్ముడు, మీ నాన్న, మీ తాత....అంతా మీ వాళ్ళే జులాయ్‌లు....ఎప్పుడూ మా పుట్టింటి వాళ్ళని ఆడిపోసుక్కోడం తప్ప వేరేం పనేం లేదా మీకు?"

"ఇప్పుడు మీ పుట్టింటి వాళ్ళను నేనేమన్నానే" ఆశ్చర్యంగా అడిగాడు సీతారాం.

"గాలిపటాలెగరేసే వాళ్ళు వొఠి జులాయ్ వెధవలని అన్నారుగా పోయిన సంక్రాంతికి మా తమ్ముడు ఇక్కడికి వచ్చినప్పుడు గాలిపటాలెగరేశాడనేగా అలా అంటున్నారు?"

"హవ్వ? నేనా ఉద్దేశంతో అన్లేదే! సర్లె సర్లె....అలా కోపంగా చూడకు. గాలిపటా లెగరేసే వాళ్ళు జులాయ్ వెధవలేం కాదులే. మీ తమ్ముడు గాలిపటాలెగరేశాడనే విషయం మర్చిపోయి అలా అన్నాను.


హి....అంతే హిహి....ఇప్పుడు కావాలంటే నేను కూడా ఎగరేస్తాను.. మన బుజ్జికొండకి కూడా కొనిస్తాను..అవును గానీ వీడేడీ?" అన్నాడు. గదంతా కలియజూస్తూ.

ఆ గదిలో బుజ్జికొండలేడు.

"వాడెక్కడికెళ్తాడూ....పక్కగదిలో ఉండుంటాడు" అంది దుర్గాదేవి.

ఇద్దరూ పక్కగదిలోకి వెళ్లి చూశారు.బుజ్జికొండ అక్కడ కూడా లేడు. ఇంతలో పక్కింటబ్బాయి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"అంకుల్....అంకుల్....మీ బుజ్జికొండ రోడ్డుమీద "వా...." అని ఏడుస్తూ దొర్లుకుంటూ వెళ్ళిపోతున్నాడు...." అన్నాడు వగరుస్తూ.




సీతారాం లబ్బున మొత్తుకుంటూ వీధిలోకి పరుగుతీశాడు. అలా ఫర్లాంగుదూరం పరుగెత్తిన తరువాత అక్కడ బుజ్జికొండ వేగంగా దొర్లుకుంటూ పోవడం కన్పించింది.

సీతారాం బుజ్జికొండని పట్టుకుని నేలమీద నుండి లేపి నిలబెట్టి

బట్టకంటిన దుమ్ము దులిపి "నీకు గాలిపటం నేనిస్తాగా.... వూర్కోమ్మా వూర్కో...." అని నచ్చజెప్పి ఇంటికి తీస్కెళ్ళాడు.

"పొద్దున్నే బాబునెంత కష్టపెట్టారో! పాపం వాడు అన్నం కూడా తినలేదు వెధవ...." అంది దుర్గాదేవి బుజ్జికొండ తల నిమురుతూ.

"ఒరేయ్ కొండా....నువ్వు అన్నం తినిరా.... నేనేమో నీకు గాలిపటం ఇస్తా" అన్నాడు సీతారాం.

అన్నం తినడానికి బుజ్జికొండ దుర్గాదేవితోబాటు లోపలికి వెళ్ళాడు

ఈ లోగా సీతారాం ఓ పాతన్యూస్ పేపరొకటి చీపురు పుల్లలు రెండు కాస్త జిగురు తీస్కుని గాలిపటం తయారుచేశాడు.

బుజ్జికొండ అన్నం తినేసి చొక్కా ఎత్తి మూతి తుడ్చుకుంటూ లోపల్నుండి వచ్చాడు.

"రా నాన్నా....రా" అంటూ బుజ్జికొండని అక్కున చేర్చుకుని ప్రేమగా వీపునిమురుతూ "చూశావా నీ కోసం ఎంచక్కని గాలిపటం తయారుచేశానో!" అన్నాడు న్యూస్‌పేపరు గాలిపటాన్ని చూపిస్తూ.

దాన్ని చూస్తూనే బుజ్జికొండ ఘొల్లుమన్నాడు. చెంగున నేల మీదికి దూకి కాళ్ళు ఫటఫట నేలకేసి కొట్టి తరువాత కింద కూర్చునికాళ్ల రెండూ ఒకదాని తరువాత మరొకటి మడిచి చాపుతూ మడిచి చాపుతూ నేల మీద సరసర రాచాడు.

ఈ హడావిడికి దుర్గాదేవి లోపల్నుండి పరుగెత్తుకు వచ్చింది.

"ఏంట్రా కొండా?నాన్న గాలిపటంలేదని అన్నారా?"అనిఅడిగింది.

బుజ్జికొండ కాళ్ళు నేలకేసి రాయడం ఆపి న్యూస్ పేపరు గాలిపటాన్ని చూపించి మళ్ళీ ఘొల్లుమన్నాడు.

"మీ సిగరెట్లకీ షికార్లకీ బాగానే తగలేస్తారుగానీ పిల్లాడి గాలిపటం దగ్గరికి వచ్చేసరికి మీకు ఖాదుపు గురించి గుర్తుకు వస్తుందా?.... త్వరగా వాడిని పట్టుకోండి దొర్లుకుంటూ వెళ్ళిపోతున్నాడు" అంది దుర్గాదేవి చిరచిర్లాడుతూ.

సీతారాంజుట్టుపీక్కునివీధిలోకిపరుగెత్తిబుజ్జికొండనిపట్టుకున్నాడు.

"పదరా వెధవా....షాపుకెళ్ళి గాలిపటం కొనుక్కుందాం...." అన్నాడు సీతారాం పళ్ళునూరుతూ.

"అలా కోపంగా అంటే నేను రోడ్డుమీద దొర్లుతానంతే" అన్నాడు బుంగమూతి పెట్టి బుజ్జికొండ.

"సర్లె....అలా అనన్లే పద" అని మనసులోనే పళ్లునూరి గాలి పటాలమ్మే షాపుకి బుజ్జికొండని తీస్కెళ్ళాడు సీతారాం.

"మాంచిగాలిపటాలుచూపించవోయ్"అన్నాడుసీతారాంషాపువాడితో.

షాపువాడు సీతారాం వంక, బుజ్జికొండ వంక మార్చి మార్చి చూసి సీతారాంని అభినందన పూర్వకంగా చూశాడు.

"మీరు మహాత్ములు సార్.... పేదలు పాలిట పెన్నిధి సార్ మీరు!...." అన్నాడు అర్ధనిమీలిత నేత్రాలతో చేతులు జోడించి.

సీతారాం కంగారుగా వెనక్కి తిరిగి చూశాడు.

"మీతోనే సార్ నేనంటుంది"

"నేనా?.... ఎందుకూ?" తెల్లబోయి చూస్తూ అడిగాడు సీతారాం

"ఎందుకేమిటి సార్....మీకు బీదా గొప్పా తారతమ్యం లేదు సార్....ఒక అడుక్కునే బాలుడి సర్దా గ్రహించి ఆ అబ్బాయి సర్దా తీర్చడం కోసం మీ వెంట తీసొకొచ్చారంటే నిజంగా మీరు గ్రేట్. సార్...." అన్నాడు బుజ్జికొండ వంక చూస్తూ షాపువాడు.

సీతారాం సిగ్గుపడ్డాడు.

"హబ్బే....వాడు అడుక్కునే వాడి కొడుకు కాదు....మా వాడే. ఇందాకట్నుంచీ గాలిపటం కోసం రోడ్డుమీద పొర్లి పొర్లి అలా తయారయ్యాడు...." అన్నాడు.

షాపువాడు అటు తిరిగి నాలుక్కొరుక్కున్నాడు.

"మరి మాకు మంచి గాలిపటాలు చూపిస్తావా?" అన్నాడు సీతారాం సిగ్గుతో చితికిపోతూ.

"ఇది తీసోకోండి సార్....బాగుంటుంది...." అన్నాడు షాపువాడు పెద్ద గాలిపటం చూపిస్తూ.

"హబ్బే....ఇంత చిన్నపిల్లాడికి అంత పెద్ద గాలిపటం ఎందుకోయే....డబ్బు దండుగ!కొస్త చిన్నది ఇవ్వు...." అన్నాడు సీతారాం.

"సార్....మీ బాబు నేలమీద దొర్లుకుంటూ పోతున్నాడు" ఆశ్చర్యంగా చూస్తూ కంగారుగా అన్నాడు షాపువాడు.

"బాబూ....వాడికా పెద్ద గాలిపటమే కావాలంట!....అదే ఇచ్చేసేయ్...." అంతకంటే కంగారుగా అని సీతారాం పరుగెత్తుకు వెళ్లి బుజ్జికొండని పట్టుకున్నాడు.

ఇద్దరూ గాలిపటం తీసుక్కుని ఇంటికి వెళ్ళారు. సీతారాం గాలిపటానికి సూత్రం కట్టి బుజ్జికొండకి ఇచ్చాడు. బుజ్జికొండ దాన్ని ఎగరేస్తుంటే అది పైకి ఎగరకుండా గాల్లో రివ్వురివ్వుమని గుండ్రంగా అయిదారు రౌండ్లు తిరిగి తపీమని నేలకి కొట్టుకుని చిరిగిపోయింది.

దాంతో బుజ్జికొండ మళ్ళీ నేలమీద దొర్లడం మొదలుబెడ్తే సీతారాం నెత్తి కొట్టుకుని షాపుకెళ్ళి మరో గాలపటం తెచ్చాడు. ఈసారది పైకి బాగానే ఎగిరిందిగానీ ఓ చెట్టుకొమ్మల్లో ఇరుక్కుపోయింది.

సీతారాంకి మరోసారి గాలిపటాల షాపుకు వెళ్ళక తప్పలేదు.

ఈసారైతే బుజ్జికొండ గాలిపటాన్ని బాగానే ఎగరెయ్యసాగాడు. సీతారాం తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు గానీ ఆ తృప్తి ఎంతసేపో ఉండలేదు. బుజ్జికొండ ఎగరేస్తున్న గాలిపటం దారం దారిన స్కూటర్ మీదపోయే ఒకాయన గొంతుకు చుట్టుకుని రోడ్డుమీద ఢామ్మని పడిపోయాడు. అతనికి బాగా దెబ్బలు తగిలాయ్.

అతనికి ఆసుపత్రి ఖర్చులూ, స్కూటర్ రిపేర్‌కీ కలిపి మూడు వందల రూపాయలు ఇవ్వాల్సి వచ్చింది సీతారాంకి.

ఆ రోజే కాదు....రోజూ ఈ గాలిపటాల వల్ల సీతారాంకి మనసుకీ శరీరానికీ విశ్రాంతి ఉండడం లేదు. అంతేకాదు....ఇంటికొచ్చిన ప్రతివాళ్ళనీ "అంకుల్....గాలిపటం కొనుక్కుంటాను....డబ్బులివ్వరా!" అని బుజ్జికొండ అడుగుతున్నాడు. వాళ్ళు వెంటనే ఇవ్వకపోతే రోడ్డుమీదకి దొర్లుకుంటూ పోతాడు.

అంచేత సీతారాం ప్రస్తుతం రోడ్లవెంట మనశ్శాంతి లేక పిచ్చివాడిలా తిరుగుతున్నాడు. ఈ గాలిపటాల సీజను అయ్యేదాకా అతని పరిస్థితి అంతే పాపం!